సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 26 । జనవరి । 2025


జెండాల తయారీలో మహిళలు

రాజ్యాంగ స్ఫూర్తి.. గణకీర్తి

- సాగు, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో రాణింపు
- ఆదర్శం.. పలువురు ఉమ్మడి జిల్లావాసులు
- రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తి

అవకాశాలు, హక్కులతో అభివృద్ధికి బాటలు

మన రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన అవకాశాలు, హక్కులు, బలహీనులకు ఆపన్నహస్తం ఇచ్చింది. దాని నీడలో గ్రామాలు, నగరాల అభివృద్ధికి బాటలు పడ్డాయి. రాజ్యాంగ ఫలాలతో తమను తాము తీర్చిదిద్దుకుంటున్న ఎందరో దేశ ప్రగతి, సంక్షేమం, అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. చదువుకున్న పలువురు యువత ఉద్యోగాలు వదిలి, సాగు బాట పట్టారు. వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీ ఉపయోగిస్తూ.. ఆదాయం పొందుతూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉపాధి కోసం ఎదురుచూసిన కొందరు మహిళలు యజమానులుగా పలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ యువత దేశ రక్షణకు సైన్యంలో చేరుతున్నారు. దేశభక్తి పెంపొందేలా పలు ప్రాంతాల్లో నిత్య జనగణమన ఆలపిస్తున్నారు. జాతీయ జెండాల తయారీతో సిరిసిల్ల నేతన్నలు ఉపాధి పొందుతున్నారు. ఇక్కడి జెండాలు దేశవ్యాప్తంగా సరఫరా అవుతుండటం మనకు గర్వకారణం. రాజ్యాంగం అమల్లోకి వచ్చి, నేటితో 75 ఏళ్లు పూర్తవుతున్న, గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో స్ఫూర్తిగా నిలుస్తున్న పలువురిపై ప్రత్యేక కథనం.

దేశమంతటికీ సిరిసిల్ల జెండాలు

సిరిసిల్ల: వస్త్రోత్పత్తి ఖిల్లా.. సిరిసిల్ల. ఇక్కడ ఉత్పత్తి అయ్యే బట్టతో జాతీయ జెండాలు తయారవుతాయి. స్వాతంత్ర్య, గణతంత్ర, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భంగా ఇక్కడి జెండాలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు సరఫరా అవుతూ ఇక్కడి నేతన్నల ఉపాధికి అండగా నిలుస్తున్నాయి. ఆగస్టు 15వ తేదీకి, జనవరి 26వ తేదీకి ముందుగానే లక్షల్లో జెండాల తయారీ, అమ్మకాలు జరిగిపోతాయి. సిరిసిల్లలో ఉత్పత్తి అయిన వస్త్రాన్ని ప్రాసెసింగ్ చేసి, మూడు రంగుల్లో ప్రింటింగ్ చేయిస్తారు. ఆ బట్టను జెండాల సైజును బట్టి, మెషిన్లపై మహిళలు కుడుతారు. ఒక్కో జెండాను రూ.50 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు.

పల్లెల నుంచి సైన్యంలోకి..


అనిల్ విగ్రహం వద్ద సేవా మెడల్‌తో సతీమణి సౌజన్య

పెద్దపల్లిరూరల్/ఇల్లంతకుంట/మల్యాల/బోయినపల్లి: పల్లె యువత సైన్యంలో చేరేందుకు ముందుకు వస్తున్నారు. సరిహద్దుల్లో పహారా కాస్తూ దేశ రక్షణ కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడుతున్నారు. పెద్దపల్లి మండలంలోని మారెడుగొండ, బ్రాహ్మణపల్లి నుంచి దాదాపు 40 మంది యువకులు సైన్యంలో ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, తదితర విభాగాల్లో పని చేస్తున్నారు. బ్రాహ్మణపల్లికి చెందిన మేకల విజయ్‌కుమార్ మాజీ సైనికుల సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట నుంచి ఏడుగురు యువకులు ఆర్మీ సైనికులుగా చైనా, పాకిస్తాన్ బార్డర్‌లలో ఎముకలు కొరికే చలిలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ గ్రామానికి చెందిన జెట్టి పోచయ్య, ఎండీ.జైనుద్దీన్ మొదటగా ఆర్మీలో సేవలందించారు. మల్యాల, బోయినపల్లి మండలాల నుంచి కూడా పలువురు యువకులు సైన్యంలో సేవలందిస్తున్నారు. మల్కాపూర్‌కు చెందిన పబ్బాల అనిల్ 2023 మే 4న జమ్మూకశ్మీర్‌లోని నదిలో హెలికాప్టర్ పడిపోయిన ప్రమాదంలో మృతిచెందాడు. ఈ నెల 14న పుణేలో జరిగిన భారత సైనిక దినోత్సవంలో మరణానంతర సేవా మెడల్‌ను అనిల్ సతీమణి సౌజన్యకు అందజేశారు.

సాగులో డ్రోన్ స్ప్రేయర్..

- ఫార్మసీ చదివిన యువరైతు కొత్త తరహా వ్యవసాయం


డ్రోన్ స్ప్రేయర్‌తో పిచికారీ చేస్తున్న మహిపాల్‌రెడ్డి

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలంలోని భూషణరావుపేటకు చెందిన గడ్డం మహిపాల్‌రెడ్డి వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీ వినియోగిస్తున్నాడు. హైదరాబాద్‌లో బీ.ఫార్మసీ చదివి, కొన్నేళ్లు ఫార్మా కంపెనీల్లో పని చేశాడు. తర్వాత స్వగ్రామానికి వచ్చి, వ్యవసాయం చేస్తున్నాడు. 4 నెలల క్రితం పంట పొలాలకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసే డ్రోన్ స్ప్రేయర్ కొనుగోలు చేశాడు. తన పొలానికే కాకుండా గ్రామంలోని ఇతర రైతుల పొలాలకు కూడా దీన్ని ఉపయోగిస్తున్నాడు. ఎకరా పంటకు రూ.500 తీసుకొని డ్రోన్ స్ప్రేయర్‌తో క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నట్లు తెలిపాడు. కూలీలను పిలవాల్సిన అవసరం లేకుండానే పని పూర్తవుతోందని రైతులు చెబుతున్నారు.

కలెక్టరేట్‌లో క్యాంటీన్

- ఆదర్శంగా నిలుస్తున్న మల్కాపూర్‌వాసి రాజమణి

కరీంనగర్ అర్బన్: కరీంనగర్‌లోని మల్కాపూర్‌కు చెందిన పల్లె రాజమణి మహిళా లోకానికే ఆదర్శంగా నిలుస్తోంది. కలెక్టరేట్‌లో క్యాంటీన్‌ను నిర్వహిస్తూ పలువురు మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. ఆమె వంటలకు ఫిదా అయిన కలెక్టర్ పమేలా సత్పతి తరచూ క్యాంటీన్‌ను సందర్శిస్తూ రుచిచూస్తున్నారు. క్యాంటీన్‌కు ఆదరణ పెరగడంతో సందడిగా కనిపిస్తోంది. రాజమణి శ్రీసాయి మహిళా సంఘంలో సభ్యురాలు. 4 నెలల క్రితం వరకు మల్కాపూర్‌లో కర్రీ పాయింట్ నిర్వహించేది. ప్రస్తుతం ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా కలెక్టరేట్ క్యాంటీన్‌ను నడిపిస్తోంది. వివిధ రకాల టిఫిన్లు, భోజనం, పచ్చళ్లు, పిండి వంటలు విక్రయిస్తోంది. 4 పాడి గేదెలను కొనుగోలు చేసి, వాటి పాలతోనే క్యాంటీన్‌లో టీ, పాలు, పెరుగు అమ్ముతోంది. క్యాంటీన్ పల్లె వాతావరణాన్ని


కలెక్టరేట్‌లోని క్యాంటీన్


రాజమణి

మరిపించే చిత్రాలతో ఆకట్టుకుంటోంది. ఆరుబయట చెట్ల నీడన టీ తాగుతూ సేదతీరేలా టేబుళ్లు ఏర్పాటు చేశారు. క్యాంటీన్ నిర్వహణలో కలెక్టర్ మేడమ్ ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని రాజమణి చెబుతోంది. మహిళా శక్తి క్యాంటీన్‌కు ప్రభుత్వం మరింత ప్రచారం కల్పించాలని కోరుతోంది.

1950నాటి నాణెం.. అంబేడ్కర్ స్టాంపులు


సాయిరాం సేకరించిన నాణేలు, స్టాంపులు


సాయిరాం

సిరిసిల్లటౌన్: సిరిసిల్లకు చెందిన కొత్వాల సాయిరాం చిన్నప్పటి నుంచే దేశ స్వాతంత్ర్యోద్యమ పోరాట కథలు చదివాడు. వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలకు సంబంధించిన క్లిప్పింగులు సేకరించడం అలవాటుగా మార్చుకున్నాడు. ఏటా జనవరి 26, ఆగస్టు 15, అక్టోబర్ 2వ తేదీల్లో వాటిని ప్రదర్శిస్తున్నాడు. ఈ ఏడాది రిపబ్లిక్ డే సందర్భంగా తాను సేకరించిన నాణేలు, పోస్టల్ స్టాంపులను ప్రదర్శించాడు. 1950లో భారత రాజ్యాంగం అమలైన సందర్భంగా ముద్రించిన రూపాయి నాణెం, వివిధ దశల్లో రాజ్యాంగ ప్రదాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఫొటోతో ముద్రించిన స్టాంపులను సేకరించాడు. వాటిని చూసిన పలువురు సాయిరాంను అభినందిస్తున్నారు.

జమ్మికుంటలో నిత్య జనగణమన

- కార్యక్రమ రూపకర్త అప్పటి సీఐ ప్రశాంత్‌రెడ్డి
- ఆదర్శంగా పలు రాష్ట్రాల్లో నిర్వహణ

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పట్టణంలో 2017 ఆగస్టు 15న ప్రారంభమైన నిత్య జనగణమన కార్యక్రమం ఎనిమిదేళ్లుగా కొనసాగుతోంది. నిత్యం ఉదయం 7 గంటల 52 నిమిషాలకు ప్రధాన కూడళ్లతోపాటు గాంధీ చౌక్ వద్ద ప్రజలు జాతీయ గీతం పాడుతున్నారు. ఉరుకుల పరుగుల జీవనంలో ప్రజల్లో దేశభక్తి పెంపొందించే లక్ష్యంతో అప్పటి సీఐ, ప్రస్తుత ఏసీపీ సైబర్ క్రైం బ్యూరో హైదరాబాద్ పింగిళి ప్రశాంత్‌రెడ్డి దేశంలోనే తొలిసారి నిత్య జనగణమనకు ఇక్కడ రూపకల్పన చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని, దేశంలోని కర్ణాటక, రాజస్థాన్, మహారాష్ట్ర, హరియాణా, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో అమలు చేస్తున్నారు. నిత్య జనగణమన ఒక పండుగ రూపం దాల్చాలని బలంగా కోరుకున్నాను. నా కల నెరవేరినందుకు సంతోషంగా ఉందని ఏసీపీ తెలిపారు. జమ్మికుంట మున్సిపల్ అధికారులు, ప్రభుత్వం చొరవ తీసుకొని, నిత్యజనగణమన కార్యక్రమానికి కావాల్సిన వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.


ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి


జాతీయ గీతం పాడుతున్న పోలీసులు, ప్రజలు

న్యూస్‌రీల్

పనులు పూర్తిచేయండి


పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారులోని కూనారం రోడ్డు, చందపల్లిలో నిర్మిస్తున్న డబుల్ బెడ్రూమ్ ఇళ్ల వద్ద మిగిలిన మౌలిక వసతులను మార్చి మొదటి వారంలోగా పూర్తిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్‌తో కలిసి శనివారం కలెక్టర్ పనుల ప్రగతిపై ఆరా తీశారు. విద్యుత్ సరఫరా, డ్రైనేజీ పనులు పూర్తిచేయాలని అన్నారు.

10లోగా దరఖాస్తు చేయాలి

ఆర్మీలో చేరేందుకు ఆసక్తి గలవారికి ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇస్తున్నామని, ఇందుకోసం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఆసక్తి, అర్హత గలవారు ఫిబ్రవరి 10లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 83094 35264, 83330 44460, 95736 88952 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రజారోగ్యంపై సర్వే


సర్వే చేస్తున్న వైద్యవిద్యార్థులు

కమాన్‌పూర్(మంథని): రామగుండం సింగరేణి మెడికల్ కళాశాల(సిమ్స్)కు చెందిన 2023 బ్యాచ్ వైద్య విద్యార్థులు శనివారం మండల కేంద్రంలో పర్యటించారు. ప్రజల ఆరోగ్య స్థితిగతులపై సర్వే చేశారు. సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్ ఆదేశాల మేరకు విద్యార్థులు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ప్రతీనెల వారి ఆరోగ్యస్థితిపై ఆరా తీస్తున్నారు. ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ శ్రీదేవి, కావ్యరాసన్, రవీందర్, నాగరాజులు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే చదవాలి


బహుమతులు అందిస్తున్న డీఈవో మాధవి

ధర్మారం(ధర్మపురి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని డీఈవో మాధవి అన్నారు. రచ్చపల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం జరిగిన పేరెంట్, ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రతీఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. హెచ్‌ఎం వంశీమోహనాచార్యులు, ఉపాధ్యాయులు సంపత్, లక్ష్మణ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ ప్రమీల పాల్గొన్నారు.

ఎన్టీపీసీ అధికారులతో సమావేశం

పెద్దపల్లిరూరల్: రామగుండం ఎన్టీపీసీ అధికారులతో కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం సమావేశమయ్యారు. తెలంగాణ స్టేజ్–2 ప్రాజెక్టులో 800మెగావాట్ల 3 యూనిట్ల నిర్మాణం కోసం ఈనెల 28న ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఎన్టీపీసీ జెడ్పీ హైస్కూల్ మైదానంలో జరిగే ప్రజాభిప్రాయ సేకరణపై సమీక్షించారు.

గణతంత్ర వేడుకలకు ముస్తాబు


అతిథుల కోసం సిద్ధం చేసిన కుర్చీలు

కలెక్టరేట్ ఆవరణలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్ గణతంత్ర వేడుకలకు ముస్తాబైంది. మైదానాన్ని ముగ్గులతో అందంగా అలంకరించారు. వేదికపై షామియానాలు వేశారు. అతిథులు కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చేందుకు, పోలీసులు గౌరవవందనం సమర్పించేందుకు వీలుగా అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. – పెద్దపల్లిరూరల్


ఆకట్టుకుంటున్న ముగ్గులు


సిద్ధమైన వేదిక

అసంతృప్తి.. భావోద్వేగం

- ఐదేళ్ల పాలనపై కార్పొరేటర్ల స్పందన

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పాలకుల్లో కొందరు తమ ఐదేళ్ల పాలనపై అసంతృప్తి వ్యక్తం చేయగా.. మరికొందరు భావోద్వేగాలకు గురయ్యారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ అధ్యక్షతన శనివారం 16వ, ఆఖరు బల్దియా కౌన్సిల్ సమావేశం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగింది. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, బల్దియా ఎఫ్ఏసీ కమిషనర్ అరుణశ్రీ, ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, ట్రాన్స్‌కో, బల్దియా అధికారులు హాజరయ్యారు.

మేయర్ అసంతృప్తి...

'మేయర్‌ను కూడా అధికారులు గౌరవించలేదు.. నా డివిజన్‌లో ప్రజాపాలనకు హాజరుకాలేదు.. మా తీర్మానం లేకుండానే పనులు చేపడుతున్నారు.. ప్రొసీజర్ ప్రకారం నడుచుకోవడం లేదు.. కౌన్సిల్‌లో చర్చిస్తే మంచి ఆలోచనలు అమలు చేయడానికి ఆస్కారం ఉండేది' అని నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తమకు కనీస మర్యాద ఇవ్వడం లేదని 17వ డివిజన్ కార్పొరేటర్ సాగంగి శంకర్ ఆవేదన చెందారు. 3వ డివిజన్‌లో డంపింగ్ యార్డు ఏర్పాటు యత్నాలను ఉపసంహరించుకోవాలని కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పిచ్చికుక్కల బెడద తీర్చాలని 16వ డివిజన్ కార్పొరేటర్ కిషన్‌రెడ్డి ప్లకార్డుతో నిరసన తెలిపారు. తనపైనే కుక్కలు దాడిచేశాయని, అయినా స్పందించకపోవడం శోచనీయమని కార్పొరేటర్ సాగంటి శంకర్ అన్నారు. ఎన్నికలు నిర్వహించేంత వరకూ తమను ఆపద్ధర్మ కార్పొరేటర్లుగా గుర్తించాలని డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు కోరారు. మెప్మాలో అవకతవకలపై విచారణ జరిపించాలని ఒకరు, ఐఏఎస్‌ను కమిషనర్‌ను నియమించాలని 28వ డివిజన్ కార్పొరేటర్ ఇంజపురి పులేందర్ డిమాండ్ చేశారు. బైపాస్ రోడ్డు నిర్మించాలని కోఆప్షన్ సభ్యుడు వంగ శ్రీనివాస్‌గౌడ్ కోరారు.


కృష్ణవేణి ఆవేదన


మాట్లాడుతున్న మేయర్ అనిల్‌కుమార్

మహిళా కార్పొరేటర్ల భావోద్వేగం..

తన డివిజన్ ప్రజలు, సహకరించిన నాయకులకు రుణపడి ఉంటానని ఐదో డివిజన్ కార్పొరేటర్ కృష్ణవేణి భావోద్వేగానికి లోనయ్యారు. తనభర్త గడ్డి కనకయ్య కాంట్రాక్టర్‌గా సేవలు చేశారని, ఆయన చనిపోయాక బల్దియాలో తనకు కనీస గౌరవం దక్కడం లేదని 38వ డివిజన్ కార్పొరేటర్ సరోజన విలపించారు. కాగా, అద్దెవాహనాల పొడిగింపు, విద్యుత్ సిబ్బందికి పెట్రోల్ చెల్లింపులు, తదితర నాలుగు అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

నగర అభివృద్ధికి కృషి – ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తెలిపారు. గత పాలకులు మాటలకే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. ఏడాదిలోనే నగరంలో అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయించడంతోపాటు త్వరితగతిన టెండర్లు పూర్తిచేసి పనులు కూడా చేపట్టామని వెల్లడించారు.


27వ డివిజన్ కార్పొరేటర్ కలువల శిరీష దంపతులకు సన్మానం

క్లుప్తంగా

ఆధారాలతో దర్యాప్తు చేయాలి



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: ఆధారాలతో దర్యాప్తు పూర్తి చేసి నేరస్తులకు శిక్షపడేలా చూడాలని రామగుండం పోలీస్‌కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ అధికారులతో శనివారం ఆయన జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. విచారణలోని కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో విచారణ త్వరగా పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని అన్నారు. ఆస్తి తగాదా కేసుల్లో ప్రివెంట్ యాక్షన్ తీసుకోవాలని, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని సూచించారు. డ్రోన్ సాయంతో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. గత సంవత్సరం కన్నా ఈసారి ట్రాఫిక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాతం పెరగాలని, నేరాల శాతం తగ్గాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల డీసీపీలు చేతన, భాస్కర్, అడిషనల్ అడ్మిన్ డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచ్, ట్రాఫిక్ ఏసీపీలు రాఘవేంద్రరావు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): మంచిరామి గ్రామానికి చెందిన సింగరం మల్లమ్మ(69) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. మల్లమ్మ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఇటీవల మతిస్థిమితం కోల్పోయింది. ఈనెల 22న ఇంట్లోంచి ఎటో వెళ్లిపోయింది. బంధువుల ఇంటికి వెళ్లి ఉంటుందని కుటుంబసభ్యులు భావించారు. కానీ, ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో శనివారం మృతదేహం లభించడంతో విషాదంలో మునిగారు. భర్త ఏసూల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఒక కొడుకు ఉన్నాడు.

కొత్తపల్లిలో రైతు..

ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రానికి చెందిన సుతారి రామన్న(55) అనే రైతు శనివారం కొత్తపల్లి గ్రామ శివారులోని తన పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రామన్న కొంతకాలం పాటు వస్త్ర వ్యాపారంతో పాటు ఇటుకబట్టీల వ్యాపారం చేశాడు. దాదాపు ఐదేళ్లుగా వ్యవసాయమే చేస్తున్నాడు. అయితే, ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఎస్సై లక్ష్మణ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రామన్నకు భార్య, కుమారుడు ఉన్నారు.



రామన్న(ఫైల్)

విద్యార్థులతో ముఖాముఖి

రామగిరి(మంథని): సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ సెంటినరీ కాలనీలోని మంథని జేఎన్టీయూ విద్యార్థులతో శనివారం ముఖాముఖి నిర్వహించారు. ఎన్‌టీపీఎల్‌లో వేల కోర్సులు ఉంటాయని, ఈ సర్టిఫికెట్‌కు చాలా విలువ ఉంటుందని ఆయన తెలిపారు. వివిధ అంశాలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు సద్వినియోగం చేసుకోండి

అర్హులు తమ ఓటుహక్కును నమోదు చేసుకుని, సద్వినియోగం చేసుకోవాలని జేఎన్టీయూ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణ, తహసీల్దార్ రాంచందర్‌రావు కోరారు. జేఎన్టీయూలో ఓటుహక్కుపై విద్యార్థులకు వారు అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ మానస, ఆర్ఐ మహేశ్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మహిళలు





నృత్యాలు చేస్తున్న లేడీస్‌క్లబ్ సభ్యులు

అలరించిన బొమ్మల కొలువు

గోదావరిఖని: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆర్జీ–2 ఏరియా లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. జీఎం వెంకటయ్య, సేవా అధ్యక్షురాలు వనజ వేడుకలు ప్రారంభించారు. సింగరేణి డైరెక్టర్(పా) సతీమణి సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంక్రాంతి లక్ష్మి, గొబ్బెమ్మలు, భోగి మంటలు, బతుకమ్మ, సమ్మక్క– సారక్క జాతర, బృందావనం, వన్యప్రాణులను సంరక్షించడం, వినాయకుడు, పల్లె వాతావరణం తీరు కళ్లకు కట్టింది. డీడీఎంఎస్ బానోతు వెంకన్న, జీఎం సతీమణులు అలివేణి, విజయలక్ష్మి, మాలతి, లలిత, వాణి, లేడీస్ క్లబ్ సెక్రటరీ కల్పన, సభ్యులు సృజన, శోభన, మంజుల, లత, కవిత, రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు.. రైతు భరోసా

- కొత్త రేషన్‌కార్డులు.. ఆత్మీయ భరోసా
- నేటి నుంచే నాలుగు పథకాల అమలు
- అర్హుల జాబితా సిద్ధం చేసిన అధికారులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో రైతుభరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా పథకాలను ఈనెల 26(గణతంత్ర దినోత్సవం) నుంచి అమలు చేసేందుకు అధికార యంత్రాంగం అన్నీ సిద్ధం చేసింది. అయితే, అర్హులను ఎంపిక చేసి ఊరూరా గ్రామసభలు నిర్వహించారు. చాలా గ్రామాల్లో అనర్హులు, అధికార పార్టీ నేతల పేర్లు ఉన్నాయని, అర్హుల పేర్లు గల్లంతయ్యాయని నిరసనలు వ్యక్తమయ్యాయి. దీంతో అధికారులు కాస్త



పరేడ్ గ్రౌండ్‌లో సిద్ధమైన ఏర్పాట్లు

వెనక్కితగ్గి.. జాబితాలో పేర్లులేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

తేలిన లెక్క..

జిల్లాలోని 14 మండలాల్లో ఈనెల 26 నుంచి సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు జాబితా సిద్ధం చేశారు. ఇప్పటివరకు 12,703 మందికి కొత్త రేషన్ కార్డుల జాబితాలో చోటుదక్కింది. అలాగే 13,640 ఉపాధి కూలీల పేర్లను ఆత్మీయభరోసా కోసం, 2677 ఎకరాల సాగు యోగ్యమైన భూమిని రైతుభరోసా కోసం ఎంపిక చేశారు. లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

మండలానికో గ్రామం ఎంపిక

జిల్లాలో 4 సంక్షేమ పథకాల ఫలాలు అమలు చేసేందుకు మండలానికో గ్రామాన్ని ఎంపిక చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. పెద్దపల్లి మండలంలోని నిమ్మనపల్లిని ఇందుకోసం ఎంపిక చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. తొలుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం ప్రదర్శిస్తారు.

అధికారులదే బాధ్యత..

సంక్షేమ పథకాల అమలు కోసం అర్హులను ఎంపిక చేసే బాధ్యత అధికారులదేనని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకోసం ఎంపీడీవోలు, రేషన్‌కార్డుల కోసం తహసీల్దార్లు, ఆత్మీయభరోసా కోసం ఎంపీవోలు, రైతుభరోసా కోసం వ్యవసాయాధికారులు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.

వ్యాధి నిర్ధారణతో ఆరోగ్యం

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

రామగుండం: వ్యాధి నిర్ధారణ పరీక్షలతో అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, తగిన చికిత్స తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. అంతర్గాం మండలం కుందనపల్లిలో ఎన్టీపీసీ సహకారంతో ఓరల్ క్యాన్సర్ వైద్య శిబిరం ప్రారంభించి మాట్లాడారు. సీజీఎం(ఆర్‌అండ్‌టీ) చందన్ కుమార్ సమంత, బైజోయ్‌కుమార్ సిక్దర్, సీనియర్ ఆఫీసర్ ఆశిష్‌పాండే, డీజీఎం ప్రవీణ్‌చౌదరి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

భారీ విగ్రహం ఏర్పాటు చేస్తాం

బైపాస్ రోడ్డు ఎదుట కొండపై ఆలయ నిర్మాణంతో పాటు 150 అడుగుల హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. రామునిగుండాల కొండపై నిర్మాణ ప్రదేశాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. కార్పొరేటర్ మహంకాళి స్వామి, మాజీ కార్పొరేటర్ కొలాని కవితారెడ్డి, ఆసిఫ్‌పాషా తదితరులు ఉన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

గోదావరిఖనిటౌన్: శాతవాహన యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, వైస్ చాన్స్‌లర్ ఉమేశ్ కుమార్‌తో కలిసి కంప్యూటర్



ల్యాబ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ల్యాబ్ ప్రారంభించారు. రిజిస్ట్రార్ జాస్తి రవికుమార్, ప్రిన్సిపాల్ రమాకాంత్, అధ్యాపకులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోదావరిఖని/కోల్‌సిటీ(రామగుండం): 30వ డివిజన్‌లో రూ.2.5కోట్ల అంచనాతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నగర మేయర్ అనిల్‌కుమార్, అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రారంభించారు. సీతానగర్‌లో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీతోపాటు మల్లికార్జున్‌నగర్‌లో మేజర్ ఓపెన్‌నాలాపై వంతెన పనులకు శంకుస్థాపన చేశారు. అంబేడ్కర్‌నగర్‌లో అంబేడ్కర్ భవనం ప్రారంభించారు. రెల్లివీధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ మహంకాళి స్వామి పాల్గొన్నారు.

సింగరేణిలో ఉత్తమ ఉద్యోగులు వీరే..

- జాబితాపై పలువురి అసంతృప్తి

సింగరేణి(కొత్తగూడెం): విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చుతున్న ఉత్తమ ఉద్యోగులు, కార్మికులను సింగరేణి యాజమాన్యం ఎంపిక చేసింది. గణతంత్రం దినోత్సవం సందర్భంగా ఆదివారం కొత్తగూడెంలో జరిగే వేడుకల్లో సీఎండీ వీరిని సన్మానిస్తారు. ఎంపికచేసిన ఉద్యోగుల జాబితాను కార్పొరేట్ వెల్ఫేర్ విభాగం శనివారం విడుదల చేసింది. కార్మికుల విభాగం : నోముల రవీందర్(ఎస్‌డీఎల్ ఆపరేటర్, భూపాలపల్లి), ధరండి తిరుపతిరావు(హెడ్ ఓవర్‌మన్ ఆర్జీ–3), మేకల రమేశ్(ఎస్‌డీఎల్/హెచ్‌డీఎల్ ఆపరేటర్, అడ్రియాల), కామ వెంకటేశ్వర్లు(ఈపీ ఆపరేటర్, జీడీకే ఓసీపీ–3), భూక్యా శంకర్(ఎస్‌డీఎల్ ఆపరేటర్, జీడీకే–1, 3), అదుమునూరి సుధాకర్(వెల్డర్, ఖైరిగూడ ఓసీపీ–3), సయ్యద్ అబ్బాస్(ఫోర్‌మన్, శ్రీరాంపూర్), అటికమ్ శ్రీనివాస్(ఎస్‌డీఎల్ ఆపరేటర్, రవీంద్రఖని–5 ఇంక్లయిన్), షేక్ ఖాదర్‌బాబు(ఫిట్టర్, మణుగూరు), గిద్దలూరి నాగేశ్వరరావు(హెడ్ ఓవర్‌మన్, కొత్తగూడెం), అజ్మీరా మోహన్(కెమిస్ట్, ఎన్‌టీపీసీ) ఉన్నారు. అధికారుల విభాగంలో : వీవీఎస్‌కే.కిశోర్ బాబు(ఎస్ఈ, కొత్తగూడెం), మోల్గా చిన్నయ్య(ఎస్ఈ, ఇల్లెందు), సలాగాల రమేశ్(డీవైజీఎం, మణుగూరు), చిలక శ్రీనివాస్(ఏజెంట్, జీడీకే–1), కొండి శంకరయ్య(డీవై మేనేజర్, ఆర్జీ–2), టి.నాగేశ్వరరావు(ఎస్ఈ, ఆర్జీ–3), కన్నెపోగు శ్రీకాంత్(డీవైఎస్ఈ, అడ్రియాల), కొక్కుల శంకర్(డిప్యూటీ సూపరింటెండెంట్, మందమర్రి), కనుకుంట్ల పూర్ణచందర్(సీనియర్ అండర్ మేనేజర్, శ్రీరాంపూర్), కె.అరుణ్(ఈఈ ఈ అండ్ ఎం ఎస్‌టీపీపీ), జీఎస్ జానకీరామ్(జీఎం, కార్పొరేట్ ఏరియా), పి.రాజశేఖర్(డీవైజీఎం, కార్పొరేట్ ఏరియా), మల్లెల సుబ్బారావు(జీఎం, కార్పొరేట్ ఏరియా) ఎంపికయ్యారు.

30 విభాగాల్లోనే ఎంపికనా?

రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ కార్మికులు, అధికారులను ఎంపిక చేయగా జాబితాపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి వ్యాప్తంగా 56 విభాగాల నుంచి ఎంపిక చేసిన కార్మికులతో పోల్చితే.. 30 విభాగాల్లోని అధికారులను అధికంగా ఎంపిక చేయడం సరికాదని విమర్శిస్తున్నారు. అంతేకాక సింగరేణిలో 1,500 మంది మహిళా ఉద్యోగులు ఉంటే ఏ ఒక్కరికీ జాబితాలో చోటుకల్పించకపోవడం, జనరల్ మజ్దూర్లు, సెక్యూరిటీ గార్డులు, వైద్య విభాగం నుంచి ఎవరినీ పరిగణనలోకి తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

సెల్ఫీ వీడియోతో గృహిణి ఆత్మహత్యాయత్నం



సౌజన్య

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): స్థానిక రాజీవ్‌నగర్ తండాకు చెందిన గృహిణి తోకల సౌజన్య(32)శుక్రవారం సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఆత్మహత్యకు యత్నించింది. పోలీసుల కథనం ప్రకారం.. సౌజన్య భర్త తోకల అనురాగ్ ఏడాది క్రితం గుండెపోటుతో మరణించాడు. అప్పట్నుంచి తన కూతురు(8)తో కలిసి అత్తగారింట్లోనే ఉంటోంది. అయితే, భర్త చనిపోక కూడా ఇక్కడ ఎందుకు ఉంటున్నావని, ఇలా ఉంటే ఇంకా రూ.10లక్షల కట్నం తేవాలని అత్తింటివారు వేధిస్తున్నారు. మనస్తాపం చెందిన సౌజన్య సామర్థ్యానికి మించి కొన్ని మాత్రలు మింగుతూ సెల్ఫీ తీసుకుంది. ఆ తర్వాత గుర్తించిన స్థానికులు గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. బాధితురాలి తల్లి ఆవుల విజయ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రజాసేవతోనే మంచి గుర్తింపు



చైర్‌పర్సన్ మమతారెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు తదితరులు



సుల్తానాబాద్ పాలకవర్గంతో..

- ఎమ్మెల్యే విజయరమణారావు
- పెద్దపల్లి బల్దియాలో ఆత్మీయ సమ్మేళనం
- సుల్తానాబాద్ పాలకవర్గానికి వీడ్కోలు

పెద్దపల్లిరూరల్: ప్రజాప్రతినిధులు నీతి, నిజాయతీగా సేవలు అందిస్తేనే మంచి గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లతో శనివారం కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయసమ్మేళనంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మమతారెడ్డి, కౌన్సిలర్లను ఎమ్మెల్యే విజయరమణారావు, కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్ శాలువాలతో సత్కరించారు.

సేవ చేసేవారికే గుర్తింపు

సుల్తానాబాద్(పెద్దపల్లి): నిత్యం ప్రజాసేవ చేసే వారికే మంచిగుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మున్సిపల్ పాలకవర్గం వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, కౌన్సిలర్లను ఎమ్మెల్యే సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, కౌన్సిలర్లు, కమిషనర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎలిగేడు(పెద్దపల్లి): రైతుల సంక్షేమం, అభివృద్ధియే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే



గోదాం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

విజయరమణారావు అన్నారు. నర్సాపూర్, లాలపల్లిలో నిర్మించిన గోదాములను ఎమ్మెల్యే ప్రారంభించారు. లాలపల్లిలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. లాలపల్లిలో ఆయన మాట్లాడారు. అనంతరం నర్సాపూర్‌లో హెల్త్‌వెల్‌నెస్ సెంటర్‌కు భూమిపూజ చేశారు. డీఎంహెచ్‌వో పాల్గొన్నారు.

'కొంతం'లేని లోటు బాధాకరం

పెద్దపల్లిరూరల్: మేజర్ పంచాయతీలో వార్డు సభ్యుడిగా, కౌన్సిలరుగా సుదీర్ఘకాలం సేవలు అందించిన కొంతం శ్రీనివాసరెడ్డి ఆకస్మిక మృతి బాధాకరమని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. శ్రీనివాసరెడ్డి జయంతి సందర్భంగా కార్మికులకు ఉచిత వైద్యసేవలు ప్రారంభించి మాట్లాడారు.

అందరికీ ఆరోగ్యం

ఓదెల(పెద్దపల్లి): ఉచిత వైద్యశిబిరాలతో అందరూ ఆరోగ్యవంతులవుతారని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. నాయకులు రవిగౌడ్, స్వరూప పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిద్దాం

- అడిషనల్ కలెక్టర్ వేణు

పెద్దపల్లిరూరల్: వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాలను నియంత్రించొచ్చని అడిషనల్ కలెక్టర్ వేణు అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆర్డీవో రంగారావుతో కలిసి పాల్గొన్నారు. బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. ఏఎంవీఐ మధు పాల్గొన్నారు.

ఓటుహక్కు విలువైంది

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు విలువైందని అడిషనల్ కలెక్టర్ వేణు అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవంలో ఆయన మాట్లాడారు. అర్హులు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఏడాది 'నథింగ్ లైక్ ఓటింగ్.. ఐ ఓట్ ఫర్ ష్యూర్'తో ఓటరు దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులు అభినందించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ వేణు, ఆర్డీవో

ఓటుహక్కు వజ్రాయుధం లాంటిది

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదని అదనపు కలెక్టర్ వేణు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఏలు వేసిన ముగ్గులను పరిశీలించిన ఆయన.. ఉత్తమంగా ఎంపికైన వారికి ప్రశంసా పత్రాలు అందించి మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల అభ్యున్నతికి కృషి

- ఎన్టీపీసీ సీజీఎం చందన్‌కుమార్ సామంత



ప్రశంసాపత్రాలు అందిస్తున్న సీజీఎం చందన్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): బాలికల అభ్యున్నతికి ఎన్టీపీసీ కృషి చేస్తోందని ఆ సంస్థ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు సీజీఎం చందన్‌కుమార్ సామంత అన్నారు. స్థానిక కాకతీయ ఆడిటోరియంలో శనివారం బాలికా సాధికారత మిషన్ శీతాకాల శిబిరం ముగింపు వేడుకలు నిర్వహించారు. సీజీఎం హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు నెలరోజులపాటు శిక్షణ అందించామన్నారు. ఈ సందర్భంగా వారిలోని సృజనాత్మకతను వెలికితీయడంతో వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన 10 మంది బాలికలకు ఉచిత విద్య అందిస్తున్నామని స్పష్టం చేశారు. బాలికలకు ప్రశంసాపత్రాలు అందించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సామంత, జనరల్ మేనేజర్లు, ఉన్నతాధికారులు, వివిధ యూనియన్ల ప్రతినిధులు, జెమ్ కార్యక్రమంలో శిక్షణ పొందిన బాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలి

గోదావరిఖనిటౌన్: విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుని, ఉన్నతంగా చదవాలని అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మార్కండేయకాలనీలో శనివా రం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. బాలికలకు సమస్యలు ఎదురైతే షీటీమ్‌ను సంప్రదించాలని లేదా డయల్ 100 నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రతినిధులు రజని, గుడికందుల భూమయ్య, మిట్టపల్లి శంకర్, గర్రెపల్లి ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశానికి వెలుగులు.. నిర్వాసితులకు చీకట్లా?

- 28న ఎన్టీపీసీ ఏరియా బంద్
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్



మాట్లాడుతున్న కోరుకంటి చందర్, అభిషేక్‌రావు

జ్యోతినగర్(రామగుండం): రామగుండంలోని ఎన్టీపీసీ విద్యుత్ ప్రాజెక్ట్ దేశానికి వెలుగులు అందిస్తున్నా.. నిర్వాసితుల కుటుంబాలు చీకట్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ విమర్శించారు. ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ స్టేజ్–2లో చేపట్టే 2,400 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టుతో ఈ ప్రాంతం కాలుష్యంగా మారుతుందన్నారు. విలువైన భూములు అందిస్తున్న నిర్వాసితులకు ప్రాజెక్టులో ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభావిత, పునరావాస ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించి, మౌలిక వసతులు కల్పించాలని ఆయన కోరారు. కాంట్రాక్టు కార్మికుల పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించి ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. యాష్‌పాండ్ నిర్మాణం కోసం 600 ఎకరాలను సేకరించేందుకు ఈనెల 28న ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతోందని, అంతకుముందుగానే నిర్వాసితులకు కల్పించే ప్రయోజనాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కుందనపల్లి, మల్యాలపల్లె, అక్బర్‌నగర్, బద్రిపల్లె, మొఘల్‌పహాడ్, మాతంగి కాలనీవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. లేకుంటే ప్రజాభిప్రాయ సేకరణను బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చరించారు. దీంతోపాటు ఎన్టీపీసీ ఏరియాలో ఈనెల 28న బంద్ పాటించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణి, ఎన్టీపీసీ పట్టణ బీఆర్‌ఎస్ కమిటీ ప్రధాన కార్యదర్శి బుర్ర శంకర్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.